## విజయ కేతనం ఎగురవేసిన శ్రీ త్రివేణి విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్ కర్ర గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ శారద, తదితరులు

సైదాబాద్,మే 1: చంపాపేట శ్రీ త్రివేణి పాఠశాల విద్యార్థులు 10 వార్షిక ఫలితాల్లో విజయ కేతనం ఎగరవేశారు. ఉత్తమ ఫలితాలు సాధించి అందరి చేత శభాష్ అని అనిపించుకుంటున్నారు. మెరువ జయ హంసిని 589/600 అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలువగా, కర్నటి దీతూ సింహ 580/600 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, గోవింద హర్షిణి 577/600 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా హస్మత్ జీషాన్ 576 మార్కులు కే. సౌమ్య 565, రోహన్ కుమార్ 564, కే శ్రీకర్ ప్రసాద్ 562, ఎస్. రాజీవి 561 మార్కులను సాధించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ కర్ర గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ శారద అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కర్ర గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తమ పాఠశాలలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించామని, పరిసరాల్లో ఎక్కడ ఏ పాఠశాలకు దక్కని విధంగా అత్యధిక మార్కులు తమ పాఠశాల విద్యార్థులు సాధించారని, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయలు నుండి 35వేల రూపాయల వరకు నగదు బహుమతులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.



రంగారెడ్డి జిల్లాలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన ఎమినేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ గాయత్రి నగర్ చౌరస్తాలోని పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన 600 మార్కులకు 590 మార్కులు సాధించిన పి .అన్వేష్‌ను, ఎస్ .పూజిత 571 మార్కులు, ఎల్ వైష్ణవి 552 మార్కులు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ అభినందించారు. ప్రిన్సిపాల్ కోకిల రాణి డైరెక్టర్స్ కౌండిన్య అనిల్ పాల్గొన్నారు




మహేశ్వరం మండల పరిధిలోని దేవేంద్ర విద్యాలయ 10 ఫలితాలలో సత్తా చాటింది? ఈ పాఠశాలలో చదువుతున్న వేముల శ్రీలక్ష్మి 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. అదేవిధంగా సాయి చరణ్ రెడ్డి 600 మార్కులకు గాను 577 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సంపాదించారు. సౌమ్య 562, అహేబ 554, తపస్విని 553 మార్కులు సాధించారు. పదవ తరగతి ఫలితాలలో మహేశ్వరం మండలంలోని మొదటి స్థానంలో దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ విజయేందర్ గౌడ్, కరస్పాండెంట్ శ్వేత తెలిపారు.

– మహేశ్వరం, మే 1

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, మే 1: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే భాండాగారాలని, మన దేశ అభివృద్ధిలో వాటి పాత్ర కీలకమని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని ఏన్.జి.ఓస్ కాలనీ లైబ్రరీ గ్రౌండ్‌లో నూతన గ్రంథాలయం నిర్మాణం కోసం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 1కోటి 95లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. కాగా నిర్మాణ పనులు కొంతమేర ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం లైబ్రరీ భవనం నిర్మాణ డిజైన్స్ పూర్తి కావడంతో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతరం పుస్తక పఠనాన్ని పెంచుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మాధవరం నర్సింగ్ రావు, సుమన్ గౌడ్, రమేష్ నాయుడు, గంగం శివశంకర్, సతీష్ గౌడ్, నక్క వెంకటస్వామి, సుధాకర్ యాదవ్, జగమోహన్, శశిధర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, తుమ్మలపల్లి చరణ్ రెడ్డి, కొంగరి నరేష్, కృష్ణ, శ్రీశైలం, యాదగిరి రాజు, సురేష్, కుంచాల రాంబాబు, ప్రకాష్, రాంకోటి, నిర్మలా దేవి, వాణి, కాలనీ సంక్షేమ సంఘం మాజీ సభ్యులు సోమయాజులు, పంపన వెంకటేశ్వర్ రావు, వర్ధని జైపాల్ రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ నేతలపై కేసు నమోదు**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో గురువారం ఉదయం ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డితో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం విదితమే. కాగా శిలాఫలకంలో ఎంపీకి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రోటోకాల్ విస్మరించారని ఆగ్రహంతో బి.ఎన్.రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి వారి అనుచరులతో కలిసి వెళ్లి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీంతో గ్రంథాలయ శాఖ అధికారులు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సన్న బియ్యానికి విశేష స్పందన



సన్న బియ్యం కోసం రేషన్ షాప్‌ల వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు

మలక్ పేట, మే 1: మలక్ పేట సర్కిల్–1లో మొదటిరోజు 14, 400 మందికి సన్న బియ్యం పంపిణీ చేసినట్లు మలక్ పేట సర్కిల్–1 ఏఎస్ఓ నర్సింగ్ రాజు తెలిపారు. ఎలక్షన్ కోడ్ ముగియడంతో సర్కిల్ వన్ పరిధిలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించగా, మొదటి రోజు సన్న బియ్యం పంపిణీకి లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. సర్కిల్ పరిధిలో ఏ రేషన్ షాపు వద్ద చూసినా లబ్ధిదారులు క్యూలు కట్టి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. సన్న బియ్యం పంపిణీలో డీలర్లు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.




# ఘనంగా మేడే వేడుకలు



హయత్ నగర్ లోని మదర్ డైరీ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

హయత్ నగర్, మే 1 : హయత్ నగర్ మండల పరిధిలోని మదర్ డైరీ, ఆర్టీసీ హయత్ నగర్ డిపో, లేబర్ అడ్డా వద్ద వేర్వేరుగా కార్మిక సంఘాల నేతల ఆధ్వర్యంలో గురువారం మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హయత్ నగర్ నార్మల్ మదర్ డైరీ వద్ద ఏర్పాటుచేసిన జెండా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ కార్మిక విభాగం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ డిపో వద్ద...**

హయత్ నగర్ డిపో వద్ద ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జెండాను ఆమనగంటి వెంకన్న ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.




## కారులో చెలరేగిన
# మంటలు.. పూర్తిగా దగ్ధం

హయత్ నగర్, మే 1 :కారు ఇంజిన్‌లో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్ డివిజన్ కి చెందిన వేణుగోపాల్ రెడ్డి, భార్యతో కలిసి తన కారులో ఎలిమినేడ్ నుండి మన్సూరాబాద్ కు బయలుదేరారు. మార్గమధ్యలో హయత్ నగర్ కు రాగానే కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వస్తుండడంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ వేణుగోపాల్ రెడ్డి కారును పక్కకు నిలిపివేశాడు. మంటలు క్షణాల్లో కారు మొత్తానికి వ్యాపించడంతో వాహనదారుడు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేయగా అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర సాంకేతిక లోపాల వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటన కారణంగా విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## బాక్స్ డ్రైన్ నాలా పనుల పరిశీలన



నాగోల్‌లో బాక్స్ డ్రైన్ నాలా పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్

మన్సూరాబాద్, మే 1: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ గురువారం నాగోల్ డివిజన్లో ఆకస్మికంగా పర్యటించారు. నాగోల్, ఆర్టీఏ కార్యాలయం సమీపంలో రూ. 1.90 కోట్ల వ్యయంతో 350 మీటర్ల పొడవులో నూతనంగా నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. రాబోయే వర్షాకాలంలో వరదనీటి సమస్యలు తలెత్తకుండా నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 30 శాతం పనులను జూన్ లోపు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంతా కేశవ్ పాటిల్, హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఈఈ రమేష్ బాబు, డి.కనకయ్య, ఏఈ దీపక్ పాల్గొన్నారు.

## పది పరీక్షల్లో బాలికల విజయం



వర్షిని రెడ్డి



అక్షర

కందుకూరు, మే 1 : పదవ తరగతి పరీక్షల్లో అత్యధికంగా బాలికలు విజయం సాధించారు. 600 మారులకు గాను 500 మార్పులకు పైచిలుకు సాధించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో బాలుర కంటే బాలికలే ముందంజలో ఉన్నారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన సామ వర్షిని రెడ్డి 530 మార్కులు, నేదునూరు గ్రామానికి చెందిన పడమటి అక్షర 514 మార్కులు సాధించారు. మండలంలోని కందుకూరు, మీర్ఖాన్పేట్, నేదునూరు, లేమూరు, పులిమామిడి ముచ్చర్ల, రాచులురు, తిమ్మాపూర్, లేమూరు, గూడూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యధికంగా మార్కులు సాధించారు.

# అమరవీరులకు నివాళులర్పించిన కార్మిక నాయకులు

## ఘనంగా మేడే వేడుకలు

బడంగ్ పేట్, మే 1: మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అరుణ పతాకాలను ఎగురవేసి కార్మికుల హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ (ఏఐటీయూసీ) సీఐటీయూ ఆధ్వర్యంలో తుక్కుగూడ, హార్డ్వేర్ పార్క్, ఫ్యాబ్సిటీ, ఐడియల్ మంకల్, రంగనాయకుల కాలనీ, మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం ఘనంగా మేడే కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయంగా మేడే సందర్భంగా వారి పోరాటాలను, త్యాగాలను స్మరిస్తూ కార్మికుల హక్కులకై రాజీలేని పోరాటాలు నిర్వహించేందుకు మరింత సన్నద్ధం అయ్యేందుకు చైతన్యం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులు బంగారం రేటులను పెంచినట్టు, కార్మికుల జీతాలను పెంచకుండా అధిక ధరలు పెంచుతూ శ్రామికుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని మండిపడ్డారు. మే 20న జరగబోయే అఖిల భారత సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మికుల హక్కులను కాపాడాలని వారు కోరారు. ఉత్పత్తి సాధనాల్లో ఉన్న కార్మికుల జీవితాలను మార్చుటకు కార్మిక వర్గం చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దత్తు నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు కే .రాజు, పి. దేవేంద్ర గౌడ్, ఎన్. యాదగిరి , బ్రహ్మచారి, చంద్రశేఖర్, శ్రీరామ్ భాస్కర్, రామకృష్ణ, భిక్షపతి, బంగారయ్య పాల్గొన్నారు.

**బాలాపూర్ మండల పరిధిలో..**

బాలాపూర్ మండల పరిధిలోని బడంగ్ పేట్, జల్‌పల్లి, తదితర ప్రాంతాలలో సీఐటీయూ మండల నాయకుడు దాసరి బాబు ఆధ్వర్యంలో అరుణ పతాకాలని ఎగరవేసి అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్మికులంతా ఐక్యతతో ఉండి హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.

**సీపీఐ ఆధ్వర్యంలో..**

బాలాపూర్ మండలం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పార్టీ మండల కార్యదర్శి ముకుందం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన లెనిన్ నగర్ చౌరస్తాలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి పాల్గొని పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం రవీంద్ర చారి మాట్లాడుతూ, కార్మికుల, కర్షకుల శ్రామికుల ఆశయాల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పిచ్చి రాజు, శంకరయ్య, బండ యాదమ్మ యాదవ్, చత్రు నాయక్, పాండు నాయక్, రెడ్యా నాయక్ ,శివ నాయక్, గోపి, శ్రీనివాస్, మొగులయ్య, రామస్వామి, లక్ష్మయ్య, నారాయణ, బండలయ్య, తదితరులు ఉన్నారు.

సైదాబాద్, మే 1:అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ( మే డే)ను పురస్కరించుకొని సైదాబాద్ దోబీఘాట్‌లోని ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీలో నాంపల్లి మెట్రోపాలిటన్ లీగల్ సెల్ అథారిటీస్ పారా వాలంటీర్ సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిస్కెట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులంతాతమ హక్కులపై అవగాహన కలిగి ఉండడంతో పాటు ఐక్యంగా తమ హక్కుల సాధనకై పోరాటం చేయాలన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, హక్కుల కాపాడుకోవడం కోసం కార్మికులు నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ మేనేజర్ నరేష్, అర్ ఎన్ కులకర్ణి, కనేష్ అగర్వాల్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో మేడే సందర్భంగా ర్యాలీ తీస్తున్న ఏఐటీయూసీ నాయకులు దత్తు నాయక్, తదితరులు



సింగరేణి కాలనీలో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న సీపీఐ సీనియర్ నాయకుడు శంకర్ నాయక్, షేక్ మహమూద్, తదితరులు

**సింగరేణి కాలనీలో..**

మేడే సందర్భంగా సింగరేణి కాలనీలో ఏఐటీయూసీ జెండాను సీపీఐ సీనియర్ నాయకులు శంకర్ నాయక్, షేక్ మహమూద్ ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చికాగోలో వేల సంఖ్యలో కార్మికులు పోరాటాలు చేసి తమ హక్కులను, ఎనిమిది గంటల పనిదినాలు, పనికి తగ్గ ఫలితం, సమాన పనికి సమాన వేతనం, మహిళలు గర్భధారణ సమయంలో హక్కులు, కర్మాగారాల్లో వాటాలు, బోనస్, ఇన్సూరెన్స్ తదితర హక్కుల సాధనలో అసువులు బాసిన అమర వీరుల జ్ఞాపకార్థం ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల దినోత్సవం జరుపుకుంటామన్నారు. ఏఐటీయూసీ ఆటో యూనియన్, హైదరాబాద్ కార్యదర్శి జంగయ్య, సీపీఐ నాయకులు దశరథ్ నాయక్, అమీనా, అజయ్, శ్రీను శ్యాం నాయక్, రవి, వెంకటేష్, జానీ, పాండురంగ పాల్గొన్నారు.

ఎల్బీనగర్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాల వద్ద గురువారం తెలంగాణ రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సల్వాచారి మాట్లాడుతూ, మే 12న కొత్తపేటలోని బీజేఆర్ భవన్ లో నిర్వహిస్తున్న వార్షికోత్సవ మహాసభకు అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం 12వ వార్షికోత్సవ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సంతోష్ కుమార్, శ్రీనివాస్, నిరంజన్, ధర్మయ్య, యాదగిరి, శ్రీనివాస చారిపాల్గొన్నారు.

**దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం**

వనస్థలిపురం, ఏప్రిల్ 1 : మన దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమైనదని బీఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మధు లచ్చిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా గురువారం సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో అంకిత ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అంకిత ఎన్జీవోస్ టీం జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిహార్ అహ్మద్, గణేష్, నాయకులు పవన్ కుమార్ రెడ్డి, సురేష్ కుమార్, భాను, ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ నాయక్ ను విచారించిన ఈడీ అధికారులు

సైదాబాద్, మే 1:భూదాన్ భూముల అక్రమాలు, అవకతవకలపై, భూ వ్యవహారాలలో భాగంగా తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర నాయకులు ఆర్. శంకర్ నాయక్ ను గురువారం ఈడీ అధికారులు విచారించారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నివసించే శంకర్ నాయక్ నివాసానికి విచ్చేసిన అధికారులు సుమారు గంటకు పైగా ఆయనను విచారించారు. భూదాన్ భూముల అక్రమ వ్యవహారాలకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించారు. భూధాన్ భూముల అక్రమాలపై శంకర్ నాయక్ గత కొంత కాలం క్రితమే రాష్ట్రపతి, ప్రధానమంత్రి కార్యాలయాలకు వెళ్లి స్వయంగా ఫిర్యాదు చేశారు. అదే విధంగా న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తున్న నేపథ్యంలో ఈడీ అధికారులు రావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఈడీ అధికారులు జగన్ రెడ్డి , అనంతరెడ్డిల బృందం**

సింగరేణి కాలనీలో నివసించే ఆర్. శంకర్ నాయక్ ఇంటికి చేరుకొని తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులుగా కొనసాగిన సమయంలో రంగారెడ్డి జిల్లా పరిధిలో జరిగిన భూ అక్రమాలకు సంబంధించిన పలు విషయాలపై ఆయన్ను ప్రశ్నించే వివరాలడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ముందుగానే భూముల స్థలాల అక్రమాలపై ఎలా గుర్తించారని, అందుకు బాధ్యులు ఎవరెవరు ఉన్నారని అడిగినట్లు తెలిసింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు స్థలాలు, భూముల కొనుగోలు విషయాల్లో ఆయా విభాగం అధికారుల నిర్ణయాలు, వారి పాత్ర ల గురించి ఆయన నుంచి వివరాలు సేకరించి సేకరించినట్లు సమాచారం. అవసరమనుకుంటే మళ్లీ విచారణకు పిలుస్తామని ఆయనకు చెప్పినట్లు తెలిసింది.

## కులం పేరుతో దూషిస్తే
# శిక్షార్హులు: డిప్యూటీ తహసీల్దార్

మలక్ పేట, మే 1: కులం పేరుతో దూషించిన వారు పౌర హక్కుల చట్టం ప్రకారం శిక్షార్హులని అంబర్‌పేట మండల డిప్యూటీ తహసీల్దార్ బలరాం అన్నారు. పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓల్డ్ మలక్ పేట లోని ఓల్డ్ వాటర్ పంప్ హౌస్ పంచశీల గ్రౌండ్లో నిర్వహించిన పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై కూడా అవగాహనను కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఈ చట్టాలు ఎంత దోహదపడతాయన్నారు. ప్రతి నెల చివరి రోజున సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న శిక్షణా శిబిరాలను సద్వినియోగపరచుకొని, ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ప్రభుత్వం అట్టడుగు వర్గాల ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపరుచుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు బస్తీ వాసులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాదర్ ఘాట్ ఎస్సై భరత్ కుమార్, బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించిన బాలరాజ్

కందుకూరు, మే 1: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని రాష్ట్ర కమిటీ సభ్యుడు సిద్ధులు, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ తెలిపారు. మండల కేంద్రం లో గల పాషా నరహరి కార్యాలయంతో పాటు మండల పరిధిలోని ఆకుల మైలారం గ్రామంలో కార్మిక జెండాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, అమరుల త్యాగాలతో సాధించుకున్న చట్టాలను సమ్మె హక్కులను, ఉద్యోగ భద్రతను యూనియన్ పెట్టుకునే అవకాశం లేకుండా యాజమాన్యాలకు వత్తాసు పలికే యూనియన్లను తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులంతా ఏకమై పోరాడాలని సూచించారు .కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎండి అబ్దుల్ అజీమ్, మండల పార్టీ మాజీ కార్యదర్శులు శ్రీనివాస్, చందు, పురుషోత్తం, వెంకటేష్, మహేష్, గ్రామ పంచాయతీల కార్మికులు శారద, గణేష్, జంగమ్మ, అలివేలు, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, మాధవి, వెంకటమ్మ, ఆకులమైలారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో నోముల నరసింహ గండు మహేందర్, భరత్, చంటి, జంగయ్య పాల్గొన్నారు. ప్రపంచ కార్మిక దినాన్ని మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు వీరమల్ల శ్రీరాములు జెండాను ఆవిష్కరించిన అనంతరం మండల మాజీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ 12 గంటలు పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు యాదయ్య, శ్రీరాములు, జాఫర్ బేగ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# స్థలం వివాదంలో ఘర్షణ.. పలువురికి గాయాలు

హయత్ నగర్, మే 1:స్థలం వివాదంలో ఘర్షణ నెలకొని పలువురికి గాయాలైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...అబ్దుల్లాపుర్మెట్ మండలంలోని కోహెడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 951, 952 లో 7.28 ఎకరాల భూమిలో ప్లాట్ల యజమానులు బద్రి అశోక్, సత్యనారాయణ రెడ్డి, రఘుతో పాటు మరి కొంతమందికి సంరెడ్డి బాల్ రెడ్డి మధ్య వివాదం కొనసాగుతోంది. అసలు భూ యజమానులైన కంగుల రాములు, పోచయ్య మరి కొంతమంది కలిసి కంగుల గండయ్య, కంగుల ఈదయ్య లకు సాధారణ పవర్ అటార్నీ (జీపీఏ) ను మంజూరు చేశారు. వారు ఆ భూమిని 1970లో లేఅవుట్ చేసి 170 ఓపెన్ ప్లాట్లుగా విక్రయించారు. అనంతరం కంగుల కుటుంబ చట్టబద్ధమైన వారసులు అంతకుముందు జీపీఏ చట్టబద్ధంగా చెల్లదని, ఆభూమిని 2013లో సంరెడ్డి బాల్ రెడ్డికి విక్రయించారు. అప్పటి నుండి భూమి వివాదం నడుస్తోంది. ఓపెన్ ప్లాట్ల యజమానులు ఓఎస్ నెంబర్ 839/2015 ను సీనియర్ సివిల్ కోర్టు ఎల్బీనగర్ నందు దాఖలు చేయగా 2025, మార్చి 28న పార్సిటల్ ఇంజక్షన్ ఆర్డర్ వచ్చింది. సంరెడ్డి బాల్ రెడ్డి 2025, ఫిబ్రవరి 19న పోలీసు జోక్యాన్ని నిరోధిస్తూ రిట్ పిటిషన్ 3790/2025 హైకోర్టు నందు దాఖలు చేయగా పోలీస్, హైడ్రాకి జోక్యం చేసుకోకుండా ఆర్డర్ వచ్చింది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు 20 మంది ప్లాట్ల యజమానులైన సత్యనారాయణ రెడ్డి, బద్రి అశోక్, రఘు, కుమారి, గణేష్, వెంకట్ రెడ్డి మరికొంత మంది తమకు కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చిందని ప్లాట్లను శుభ్రం చేయడానికి జేసీబీతో భూమిలోకి ప్రవేశించారు. అదే సమయంలో సంరెడ్డి బాల్ రెడ్డి , సంరెడ్డి దిలీప్ రెడ్డి, శీలం శ్రీను, మరొకరు వచ్చి ప్లాట్ల యజమానులైన సత్యనారాయణ రెడ్డి, పండుగల వెంకటేష్, నవీన్ రెడ్డి, బద్రి అశోక్, రఘు, వెంకట్ రెడ్డి మరికొంత మందితో గొడవపడి కర్రలు, రాళ్ళు, గడ్డికోసే కత్తితో కొట్టగా సత్యనారాయణ, నవీన్, వెంకటేష్ లు గాయపడ్డారు. రెండు వర్గాల ఘర్షణలోసంరెడ్డి బాల్ రెడ్డికి గాయాలయ్యాయి. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.